

www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 28-10-2022 | సంపుటి : 04 | సంచిక : 61 | పేజీలు : 4 | వెల : రూ 3-00

# జెన్‌కో మూడో యూనిట్ ప్రారంభించనున్న సీఎం జగన్



## ముగిసిన సీఎం జగన్ నెల్లూరు పర్యటన



అమరావతి/ నెల్లూరు: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో 800 మెగావాట్ల యూనిట్‌ను యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ రంగంలో దేశంలోనే మొదటిదైన ఈ సూపర్ క్రిటికల్ యూనిట్ రోజుకు 19 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్లాంట్‌ను సీఎం వైఎస్ జగన్ గురువారం ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. సాధారణ థర్మల్ పవర్ ప్లాంట్లతో పోలిస్తే ఈ ప్లాంట్‌లో తక్కువ బొగ్గును వినియోగిస్తారు. దీనివల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం కొంత మేర తగ్గుతుంది. రోజుకు 9,312 టన్నుల బొగ్గుతో నడిచేలా ఈ యూనిట్‌ను రూపొందించారు. కృష్ణపట్నం ప్లాంట్ మొత్తం సామర్థ్యం నాలుగు యూనిట్లు కాగా, స్టేజ్–1లో ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. మూడవ యూనిట్‌గా స్టేజ్–2లోని 800 మెగావాట్ల ప్లాంట్‌ను రూ.5,082 కోట్ల అంచనా వ్యయంతో మొదలుపెట్టారు. అయితే జీఎస్టీ అమలు, చట్టంలో మార్పు, ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తంపై వడ్డీ కారణంగా అంచనా వ్యయంతో పోలిస్తే ప్రాజెక్ట్ వ్యయం కొంత పెరిగింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5,935.87 కోట్లు, రాష్ట్ర విద్యుత్ ఆర్థిక సంఘం ద్వారా రూ 1,000 కోట్ల రుణ సాయంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి రెండవసారి ట్రయల్ రన్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తాల్చేర్ నుంచి కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గు రవాణా జరుగుతుంది. బంగాళాఖాతం నుంచి సముద్రపు నీటిని గ్రహించి, ఆర్వో ప్లాంట్ల ద్వారా మంచినీటిగా మార్చి వినియోగిస్తారు. కాగా, ఈ ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008 జూలై 17న శంకుస్థాపన చేయగా, ఇప్పుడు ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ పూర్తి చేయడం విశేషం. కాగా, నేడు 3వ యూనిట్ ప్రారంభోత్సవం చేయనున్నారు. కృష్ణపట్నం పోర్టు పరిధిలోని మత్స్యకారులు, మత్స్యకారేతరుల స్వప్నాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. చేపల వేటకు అనువుగా రూ.25 కోట్ల వ్యయంతో ఫిషింగ్ జెట్టి నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. పుష్కర కాలంగా ఎదురు చూస్తున్న కృష్ణపట్నం పోర్టు నిర్వాసితులకు మత్స్యకారేతర ప్యాకేజీ సైతం పంపిణీ చేయనున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన పాదయాత్రలో కోరిన విన్నపాన్ని సీఎం హోదాలో ఆచరణలో అమలు చేస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని కృష్ణపట్నంలో పోర్టు నిర్మాణంతో సముద్రతీరంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు ఇబ్బందిగా మారింది. ఫిషింగ్ జెట్టి ఏర్పాటు చేయాలన్న ఈ ప్రతిపాదన 16 ఏళ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండిపోయింది. హార్బర్ నిర్మించాలని కూడా గతంలో పలు సర్వేలు, పరిశీలనలు చేపట్టారు. అందుకోసం పాలకులు అంచనాలు కూడా రూపొందించారు. అవేవీ కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి మత్స్యకారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని భావించారు. ఎన్నో ఏళ్లుగా మత్స్యకారుల కలగా మిగిలిపోయిన ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నేలటూరు జెన్‌కో మూడో యూనిట్ ప్రారంభోత్సవానికి గురువారం రానున్న సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ముత్తుకూరు మండలంలోని నేలటూరు పట్టపుపాళెం వద్ద రూ.25 కోట్ల వ్యయంతో ఫిషింగ్ జెట్టి నిర్మాణం చేపట్టనున్నారు. జెట్టి అందుబాటులోకి వస్తే ఉప్పు కాలువల్లో, క్రీక్‌ల్లో బోట్లు, వలలను భద్రపరుచుకునే బాధ మత్స్యకారులకు తప్పుతోంది. ఫిషింగ్ జెట్టీ వద్ద భద్రపరుచుకొనే అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల నుంచి బోట్లు, వలలను కాపాడుకోవచ్చు. సముద్రంలో వేట చేసిన మత్స్య సంపదను ఈ జెట్టి వద్ద ఎండబెట్టుకొని, భద్రపరుచుకోవచ్చు. పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు. పైగా వలలు అల్లుకొనే వెసులుబాటు లభిస్తుంది. రోడ్డు సదుపాయం ఏర్పడుతుంది.

కొనుగోలుదారులు నేరుగా ఈ జెట్టిల వద్దకు వచ్చి మత్స్యసంపదను కొనుగోలు చేసుకొనే వెసులుబాటు లభిస్తోంది. క్రమంగా ఈ జెట్టిల వద్ద కోల్డ్ స్టోరేజీలు అందుబాటులోకి రానున్నాయి. చేపలు, రొయ్యలు చెడిపోకుండా ఈ కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరుచుకోవచ్చు. భవిష్యత్‌లో ఈ ఫిషింగ్ జెట్టి క్రమంగా మినీ ఫిషింగ్ హార్బర్‌గా రూపాంతరం చెందే అవకాశం లేకపోలేదని పలువురు వివరిస్తున్నారు.

# పాదయాత్ర రద్దుపై హైకోర్టులో విచారణ..

### అవసరమైతే పిటిషన్‌లో ఇంప్లీడ్ అవుతాం: మంత్రి అమర్నాథ్



అమరావతి: అమరావతి రైతుల పాదయాత్ర రద్దు చేయాలంటూ దాఖలైన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. పాదయాత్ర రద్దుతోపాటు దాఖలైన అన్ని పిటిషన్లపై శుక్రవారం వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది. పాదయాత్రపై తమ ఆదేశాలను పాటించాల్సిందేనని మరోసారి స్పష్టం చేసింది. పాదయాత్రలో అనుమతించిన 600 మంది రైతులు మాత్రమే పాల్గొనాలని హైకోర్టు పేర్కొంది. పాదయాత్రపై విచారణ సందర్భంగా మంత్రి గుడివాడ అమర్నాథ్ కోర్టుకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై న్యాయస్థానం ఇచ్చిన అర్డర్ అనుసరించాల్సి ఉందన్నారు. రైతులు దాఖలు చేసిన పిటిషన్‌లో 17 మంది ప్రజా ప్రతినిధులు, అధికారులు పార్టీలుగా చేర్చారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను తెలపడానికి సీనియర్ కౌన్సిల్‌తో కోర్టుకు వచ్చినట్లు మంత్రి తెలిపారు. తమ ప్రాంత ప్రజలు అభివృద్ధి వికేంద్రీకరణ కోరుకుంటున్నారన్న అమర్నాథ్.. వారి మనోభావాలను కోర్టుముందు ఉంచటానికే వచ్చినట్లు స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధుల ఆకాంక్షలు మేం చెప్పకుండా ఎలా ఉంటాం. శుక్రవారం మధ్యాహ్నం వాదనలు వింటామని కోర్టు చెప్పింది. అవసరమైతే ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ అవుతాం. కోర్టు ఆదేశాల తరువాత పోలీసులు పాదయాత్రను పరిశీలిస్తే 25 మంది దగ్గర కూడా ఐడీ కార్డులు లేవు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. విశాఖతో పాటు అమరావతి కూడా బాగుండాలని మేం కోరుకుంటున్నాం. కాని అమరావతి రైతులు మాత్రం మేమే బాగుపడాలని అంటున్నారు. రెచ్చగొట్టేలా ఏ పని చేయవద్దని మేం అంటున్నాం.’ అని వ్యాఖ్యానించారు.

## మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఊసరవెల్లి

### బుద్దా వెంకన్న

విజయవాడ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఊసరవెల్లి అని టీడీపీ నేత బుద్దా వెంకన్న ఆరోపించారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని దేవుడి సొమ్ము కోట్లు దోచుకున్నాడు. కరోనా సమయంలో అందరి ఆదాయం పడిపోతే... వెల్లంపల్లి ఆస్తులు రెట్టింపు అయ్యాయి. ఈ ఊసరవెల్లి ఇప్పుడు కొత్త దందాకు తెర లేపాడు. నవ భోజనాల పేరుతో ఆర్య వైశ్యుల నుంచి కోట్లు వసూలు చేశాడు. ఎంతోమంది కి ఉపాధి కల్పించే ఆర్యవైశ్యుల ను కూడా బెదిరించాడు. కరోనా సమయంలొ ఆస్పత్రిలో బెడ్ లు ఇప్పించి కూడా డబ్బులు వసూలు చేసిన చరిత్ర వెల్లంపల్లి ది. కొనకళ్ల విద్యాధరరావు, కొండపల్లి బుజ్జిలను ఏజెంట్ లుగా పెట్టుకున్నాడు. వీరి ద్వారా డబ్బులు వసూళ్లు చేస్తున్నాడు. వచ్చే ఎన్నికలలో జగన్ సీటు ఇవ్వడని తేలిపోయిందని అన్నారు. మంత్రి, ఎమ్మెల్యే పదవులు దోచుకోవడానికేనా అన్న విధంగా వెల్లంపల్లి దందా సాగుతుంది. బాధిత ఆర్య వైశ్యులు అందరూ బయటకి రండి. వాళ్ల వాసూళ్లకు సంబంధించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. ఇప్పుడు బయట పెట్టినా అతని పై చర్యలు ఉండవని అయన అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే... వసుళ్లు చేసిన డబ్బంతా వెనక్కి రప్పిస్తాం. ఏ కులం పేరు చెప్పి ఎమ్మెల్యే అయ్యాడో... ఆ కులం వారినే దోచేస్తున్నాడు.

# రైతుల పాదయాత్ర అనుమతి రద్దుపై విచారణ రేపటికి వాయిదా



అమరావతి: అమరావతి రైతుల పాదయాత్రకు అనుమతి రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం.. అడ్డంకులు లేకుండా చూడాలంటూ రైతులు వేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. పాదయాత్రలో 600 మంది రైతులు మొదటి నుంచి చివరి వరకు పాల్గొనడం కష్టమని.. రొటేట్ అవుతుంటారని రైతుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. మహిళలు ఎక్కువ మంది ఉండటంతో వారి సమస్యలు కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పాదయాత్రలో పాల్గొనే వారికి ముందు, వెనుక సంఘీభావం తెలిపే గ్రామస్థులు ఉంటారని చెప్పారు. సంఘీభావం తెలిపేవాళ్లు రోడ్డుకు ఇరువైపులా ఉండాలని మొదటి ఉత్తర్వుల్లో లేదని చెప్పారు. రైతులకు సంఘీభావం తెలిపేవారు భోజనాల ఏర్పాటు, వసతి కల్పించడం, విరాళాలు అందించడం చేస్తుంటారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. న్యాయస్థానం మధ్యాహ్నం 12.30గంటలకు ఉత్తర్వులు జారీచేస్తే.. ఆ కాపీ రాకముందే పోలీసులు ఆంక్షలు విధించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆంక్షలు విధించడంతో పాటు రైతులు భోజనం చేసే ఫంక్షన్ హాల్‌కు వెళ్లి ఐడీ కార్డులు చూపించమన్నారని తెలిపారు. డీజీపీ కార్యాలయం నుంచి 150 మందికి మాత్రమే కార్డులు ఇచ్చారన్నారు. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ తమకు సమయం కావాలని కోరారు. పోలీసు ఆంక్షల కారణంగా తాము పాదయాత్రను బలవంతంగా వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని.. అందువల్ల వెంటనే విచారించాలని పిటిషనర్లు కోరారు. రేపు అన్ని పిటిషన్లను కలిపి విచారించి ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు తెలిపింది. ప్రభుత్వం, పిటిషనర్లు ఆచరణ యోగ్యమైన ప్రతిపాదనలతో రావాలని స్పష్టం చేసింది.

# ఏపీలో కొత్త పార్టీలు

### తెలుగుదేశం, జనసేనలకు చెక్.. జగన్ కొత్త స్కెచ్

విజయవాడ, అక్టోబరు 27, ఎన్నికలు సమీపిస్తున్నాయి.. ఆ క్రమంలో రాజకీయ పార్టీల అధినేతలు.. అధికార పీఠాన్ని కైవసం చేసుకోవడం కోసం.. అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఆ క్రమంలో ఓటర్ల ఓట్లు కొల్లగొట్టేందుకు ఎంత చేయాలో.. ఎలా చేయాలో.. ఏవి చేయాల్లో.. ఆలోచిస్తూ.. అందుకు అనుగుణంగా వ్యూహ రచనకు శ్రీకారం చుడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో అధికార పార్టీ మళ్లీ అధికారాన్ని అందుకోనేందుకు.. అదీ కూడా 175కి 175 సీట్లు కైవసం చేసుకోవడం కోసం.. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కొత్తకొత్త స్కెచ్ లకు శ్రీకారం చుడుతున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రానికి మూడు రాజధానులు.. అదీ విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధాని అంటూ ఇటీవల జగన్ పార్టీ.. విశాఖ గర్జన పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించింది. అదే రోజు విశాఖ ఎయిర్ పోర్ట్ వేదికగా చోటు చేసుకున్న పరిణామాలు అయితేనేమి.. ఆ తర్వాత కొద్ది రోజులకే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో చేసిన హాట్ కామెంట్స్ అయితేనేమి.. అదే రోజు.. సాయంత్రం విజయవాడలో పవన్‌తో టీడీపీ అధినేత చంద్రబాబు భేటీ కావడం అయితేనేమి.. ఆ కొద్ది సేపటికే చంద్రబాబుతో కలిసి పవన్ కల్యాణ్ మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం అయితేనేమి.. ఈ మొత్తం ఎపిసోడ్‌తో మళ్లీ చంద్రబాబు, పవన్ జత కట్టి వచ్చే ఎన్నికల్లో పోటీకి వెళ్తున్నారంటూ.. జగన్ ఓ నిర్ణయానికి వచ్చేశారంటున్నారు. దీంతో జనసేన, తెలుగుదేశం పార్టీ కలిసి పోటీ చేస్తే.. తాము లక్ష్యంగా పెట్టుకున్న.. 175 సీట్లలో భారీగా కోత పడే అవకాశం ఉందని జగన్.. ఫిక్స్ అయిపోయినట్లు వారు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఓట్లు భారీగా చీల్చే ప్రక్రియకు సీఎం జగన్ పథక రచన చేస్తున్నట్లు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలా రాజకీయ పార్టీలు ఉన్నాయి. మరిన్ని కొత్త రాజకీయ పార్టీలను తెరపైకి తీసుకు వచ్చి.. వాటి ద్వారా ఓట్లను చీల్చి ప్రత్యర్థులను దెబ్బకొట్టాలన్న లక్ష్యంతో సీఎం జగన్ వ్యూహరచన చేస్తున్నారని పరిశీలకులు అంటున్నారు. ఇప్పటికే తెలంగాణ సీఎం కేసీఆర్.. తన పార్టీని బీఆర్ఎస్ పార్టీగా మార్చేశారు. ఈ పార్టీ సైతం వచ్చే ఎన్నికల్లో ఏపీలో పోటీ చేయనుందని... అందుకోసం ఇప్పటికే కేసీఆర్... ఏపీలో తన పాత స్నేహితులతో టచ్‌లోకి వెళ్లి.. అడపా దడపా వాళ్లతో చిట్ చాట్ చేస్తున్నారని తెలుస్తోంది. అంతేకాదు.. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత.. సీఎం కేసీఆర్.. ఏపీలో పర్యటించేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేసుకొంటున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో ఏపీలోని వివిధ రాజకీయ పార్టీల్లోని పలువురు అసంతృప్తులను తన వైపునకు తిప్పుకునేందుకు కేసీఆర్.. ఓ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

# ఫ్యాక్షనిస్టు నోట.. సోషలిస్టు మాటా?

### జగన్ రెడ్డి పాలనంతా బీసీలను అణచివేయడమే
### మూడున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని బీసీలకు ఇక్కట్లు తప్ప ఇంకేమైనా ఉందా?
### యనమల రామకృష్ణుడు



అమరావతిస్వతంత్ర భారతదేశంలో జగన్ రెడ్డి బీసీలకు చేసినంతటి ద్రోహం, దగా ఏ రాష్ట్రంలో ఎప్పుడూ ఎక్కడా ఏ పాలకుడూ చేయలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్ రెడ్డి దుర్మార్గమైన ప్రజాకంఠక పాలనతో రాష్ట్రంలోని బీసీలు అత్యంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఉత్తరాంధ్రలో బీసీలను అణగదొక్కుతూ, బీసీల ఆస్తుల్ని దిగమింగిన విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో బీసీల సభ నిర్వహించడమే జగన్ రెడ్డి బీసీలకు చేస్తున్న ద్రోహానికి నిలువెత్తు నిదర్శనం. బీసీలకు రాజకీయంగా గుర్తింపు ఇచ్చింది, సామాజికంగా అభ్యున్నతి సాధించేలా స్వేచ్ఛ ఇచ్చింది, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రోత్సాహం ఇచ్చింది తెలుగుదేశం పార్టీనే. అందుకే తెలుగుదేశం ఆవిర్భావం నుండి.. తరాలు మారినా రాష్ట్రంలోని బీసీలంతా పార్టీ వెంటే ఉన్నారు. వారిని టీడీపీకి దూరం చేయాలనే కక్షతో బీసీలపై జగన్ రెడ్డి దాడులకు దిగుతున్నారు. వారి ఆర్థిక మూలాలను నాశనం చేస్తున్నారు. దశాబ్దాలుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు అనుభవిస్తున్న రిజర్వేషన్లను కుట్రపూరితంగా కుదించి సుమారు 16,800 మంది బీసీలకు రాజకీయ అవకాశాలు దూరం చేశారు. మూడేళ్లలో సుమారు రూ.30 వేల కోట్ల సబ్ ప్లాన్ నిధుల్ని దారి మళ్లించారు. బీసీ కుల గణన చేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిందిగా తెలుగుదేశం పార్టీ 2014లోనే తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. జగన్ రెడ్డి దాన్ని ఆమోదించేలా కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా బీసీలకు దగా చేస్తున్నారు. బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులపై షాడోలను నియమించి పెత్తనం చెలాయిస్తున్నారు. నిధుల్లేని కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించి ఉద్ధరించినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేశారు. స్వయం ఉపాధి కొరకు అందించే సబ్సిడీ రుణాలు నిలిపేశారు. బీసీల అభివృద్ధి, సంక్షేమంపై వైసీపీ మంత్రులు, నేతలు నోరెత్తకుండా అణచివేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లినా బీసీల డిమాండ్ల సాధనపై ఏ రోజూ కేంద్రాన్ని నిలదీసింది లేదు.

# సంపాదకీయం

శుక్రవారం 28-10-2022

## భిన్నత్వంలో ఏకత్వం చూపించిన బ్రిటన్

బ్రిటన్ ప్రధానిగా భారత సంతతికి చెందిన రుషి సునాక్ బాధ్యతలు చేపట్టడంపై దేశంలో హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. అదే సమయంలో భారత్ బ్రిటన్ ను చూసి ఓంతో నేర్చుకోవాలంటూ హితవులూ వినవస్తున్నాయి. విదేశీ మూలాలున్న వ్యక్తి బ్రిటన్ ప్రధాని పదవిని అధిష్టించినందుకు ఆనందంతో పొంగిపోతున్న ఈ నేతలే గతంలో సోనియా గాంధీ భారత ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశం వచ్చిన సమయంలో ఎందుకు అడ్డుకున్నారన్న ప్రశ్న సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది. విదేశీ వనిత అంటూ.. అప్పట్లో బీజేపీ వ్యక్తం చేసిన అభ్యంతరాలు.. ఆమె ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపడితే గుండు చేయించుకుంటానంటూ సుష్మా స్వరాజ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రముఖంగా చర్చకు వస్తున్నాయి.భారత సంతతికి చెందిన రుషి సునాక్ బ్రిటన్ ప్రధాని అయితే హర్షాతి రేకలు వ్యక్తం చేస్తూ ఆయనతో కలిసి పని చేయడానికి ఎదురు చూస్తున్నానంటూ ప్రధాని మోడీ ఆకాంక్షించారు. అయితే అప్పట్లో విదేశీ వనిత అంటూ సోనియా గాంధీ అత్యున్నత పీఠం అధిష్టించకుండా బీజేపీ నేతలు అడ్డుకోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని కాంగ్రెస్ ఇప్పుడు నిలదీస్తోంది. అలాగే విదేశీ మూలాలున్న సోనియా ప్రధాని పదవికి అనర్హురాలంటూ అప్పట్లో కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి శరద్ యాదవ్ సొంత కుంపటి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని ప్రారంభించిన సంగతిని గుర్తు చేస్తున్నారు. అలాగే విదేశీ మూలాలున్నరుషి సునక్ బ్రిటన్ ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించడాన్ని స్వాగతించిన ఎంఐఎం.. భారత్ కు హిజాబ్ ధరించిన మహిళను ప్రధానిగా చూడాలని తాను కోరుకుంటున్నానని అన్నారు.కర్నాటకలో త్వరలో జరగనున్నమునిసిపల్ ఎన్నికల కోసం బీజాపూర్ లో నిర్వహించిన ప్రచార సభ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ సందర్భంగానే ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి బీజేపీ కూడా దీటుగా స్పందించి తాము హిజాబ్ ధరించిన మహిళను ఎంఐఎం అధినేత్రిగా చూడాలని కోరుకుంటున్నట్లు ప్రకటించింది. ఇక ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి, జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన భారత సంతతికి చెందిన రిషి సునక్ అభినందనలు తెలుపుతూనే.. బీజేపీపై విమర్శల వర్షం కురిపించారు. బ్రిటన్ ఒక మైనారిటీ సభ్యుడిని ప్రధాని మంత్రిగా అంగీకరించిందనే విషయాన్ని బీజేపీ గుర్తించాలని పేర్కొన్నారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ సర్కార్ భారత్ లో ఎన్నార్సీ, సీఏఏ వంటి విభజన, వివక్షాపూరిత చట్టాలతో ప్రజలకు సంకెళ్లు వేసి మరీ విద్వేషాన్ని నింపుతోందని విమర్శించారు. ఇక కాంగ్రెస్ అయితే సునాక్ కు అభినందనలు తెలుపుతూనే బీజేపీపై విమర్శల తూటాలు పేల్చింది. మొదట కమలా హ్యారిస్, ఇప్పుడు రిషి సునాక్.. యూఎస్, యూకేలోని ప్రజలు నాన్ మెజార్జీ పౌరుల్ని అక్కున్న చేర్చుకుని.. ప్రభుత్వంలోని ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టారు. ఈ పరిణామం నుంచి భారత్.. ప్రత్యేకించి అత్యధిక జనాభా సిద్ధాంతాన్ని అవలంబించే పార్టీలు.. పాఠం నేర్చుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యానిస్తే.. పార్టీ అధికార ప్రతినిథి, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ ఒక అడుగు ముందుకు వేసి భిన్నత్వంలో ఏకత్వం మన డీఎన్ఏలోనే ఉందని గొప్పలు చెప్పుకోవడం కాదు.. భిన్నత్వంలో ఏకత్వం అంటే ఏమిటో బ్రిటన్ ను చూసి భారత్ నేర్చుకోవాల్సి ఉందని బీజేపీకి చురకలు వేశారు.ఇక మరో కాంగ్రెస్ నేత శశిథరూర్ సైతం యూకేలో జరిగినది అరుదైన పరిణామమన్నారు. మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అత్యున్నత, అత్యంతశక్తిమంతమైన పదవిలో కూర్చోబెట్టారనీ, భారత్ లో అలా ఎన్నటికీ జరిగే అవకాశం లేదనీ పేర్కొన్నారు.

## సినిమాలతో రాజకీయం మార్చేయవచ్చా ?

విజయవాడ, అక్టోబరు 27, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు ఏడాదిన్నర తర్వాత వస్తాయి. కానీ రాజకీయ పార్టీలు అన్ని వైపుల నుంచి విజయం కోసం ఏం చేయాలి.. ప్రజలను ఆకట్టుకునేందుకు ఏం చేయాలి అన్నదానిపై విస్తృతంగా మేధోమథనాలు నిర్వహిస్తున్నారు. ఇతర విషయాలన్నింటినీ పక్కన పెడితే రాజకీయ పార్టీల దృష్టి సినిమాలపై కూడా పడింది. వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సీఎం జగన్‌తో సీక్రెట్ భేటీ నిర్వహించడం... వెంటనే రెండు, మూడు సినిమాల రూపకల్పనకు సన్నాహాలు జరిగిపోయాయని ప్రచారం కావడంతో ఏం సినిమాలు తీయబోతున్నారు ? వ్యతిరేకంగానా ? అనుకూలంగానా ? అన్న చర్చలు ప్రారంభమయ్యాయి. రామ్ గోపాల్ వర్మ తాను ఏదనుకుంటే అది చేస్తారు. ఇతరులు ఏమనుకుంటారోనని పట్టించుకోరు. గతంలో తెలుగుదేశం పార్టీని తీవ్రంగా టార్గెట్ చేశారు. ఎన్నికలను గురి పెట్టి లక్ష్మీస్ ఎన్టీఆర్ అనే సినిమా తీశారు. ఆ సినిమాలో ఉన్న విషయాల కంటే ఆ సినిమా గురించిన జరిగిన చర్చ వల్లే టీడీపీకి ఎక్కువ డ్యామేజ్ జరిగింది. ఇప్పుడు కూడా అలాంటి సినిమాలు తీయాలనుకుంటే ఆయన తీస్తూనే ఉంటారు. పెట్టుబడి పెట్టే వాళ్లు కావాలి. అలాంటి పెట్టుబడులు పెట్టడానికి వైఎస్ఆర్‌సీపీ నేతలు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. గతంలోనే ఆయన కొన్ని వివాదాస్పదసి నిమాలు ప్రకటించారు. కానీ తెర మీదకు రాలేదు. వివిధ కారణాలతో ఆగిపోయాయి. అయితే ఇప్పుడు లక్ష్యం లాభాలు కాదు కాబట్టి.. పెట్టుబడికి సమస్య ఉండదు. ఆర్జీవీ తీయాలనుకున్న సినిమాలు తీస్తారు.ఆర్జీవీతో వైఎస్ఆర్‌సీపీ తీయించే సినిమాలు ఎలాంటివి అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సీఎం జగన్ ను ఎలివేట్ చేసేలా .. ఆయనను ప్రజా నాయకుడిగా ఉన్న ఇమేజ్ ను

**ఏపీ రాజకీయ పార్టీలూ ఏ అవకాశాన్నీ వదలడం లేదా ?**

మరింత పెంచేలా సినిమా తీయాలన్న సూచనలు ఆర్జీవీకి వెళ్లాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికలకు ముందు మహి వి రాఘవ్ దర్శకత్వంలో యాత్ర సినిమా చేశారు. అయితే అది పూర్తిగా వైఎస్ రాజశే?ఖర్ రెడ్డి సినిమా. అందులో జగన్ పాత్ర లేదు. వైఎస్ చనిపోయిన తర్వాత జగన్ ప్రస్థానం గురించి.. సినిమా తీయాలని ఆర్జీవీని కోరినట్లుగా చెబుతున్నారు. వచ్చే ఎన్నికలకు ముందు విడుదలయ్యేలా రెడీ చేయాలని సూచించినట్లుగా తెలుస్తోంది. అయితే ఆర్జీవీ అలాంటి సినిమాలు తీసే దర్శకుడు కాదు. ఆయనది పూర్తిగా నెగెటివ్ థింకింగ్ సినిమాలు. అంటే కాంట్రావర్సీ ఉండేవే తీసుకుంటారు. ఈ ప్రకారం ఆయన అభిరుచికి తగ్గట్లుగా వంగవీటి రంగా హత్య అంశాన్ని సినిమాగా తీయవచ్చన్న ప్రచారం ఉంది. పవన్ కల్యాణ్‌పై సందర్భం వచ్చినప్పుడల్లా విరుచుకుపడే ఆర్జీవీ.. అలాంటి చాన్స్ వస్తే వదులుకోరని అంటున్నారు. వంగవీటి రంగా విషయంలో ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. గతంలో సినిమాలు చేశారు. ఇప్పుడు కూడా అదే టాపిక్‌పై సినిమా తీయమని సూచనలు అందుకున్నట్లుగా చెబుతున్నారు. టీడీపీ – జనసేన పొత్తు ఉండనున్న తరుణంలో ఆ సినిమా రాజకీయ లక్ష్యాన్ని గురి పెట్టినట్లుగా ఉంటుందని చెబుతున్నారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇలా సినిమాలు తీయిస్తూంటే.. తెలుగుదేశం పార్టీ నేతలు ఊరుకునే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. టీడీపీకి సినిమా ఇండస్ట్రీలో మంచి సంబంధాలు ఉన్నాయి. తీయదల్చుకుంటే ఎలాంటి సినిమాలైనా తీయించగలుగుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ ఇప్పటికైతే అలాంటి ఆలోచన లేదంటున్నారు.

## ప్రతిపక్ష ఎమ్మెల్యేలే టార్గెట్

విజయవాడ, అక్టోబరు 27, వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో గెలిచి చూపించాలన్న పట్టుదలతో ఉన్నారు. అందుకే ఈ సారి ఆయన గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిచిన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో అన్ని నియోజకవర్గాల సమీక్షలు చేయాలనుకున్నారు. నియోజకవర్గానికి కనీసం యాభై మందితో ఈ సామావేశాలు ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే ఇప్పుడు కేవలం టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలపై దృష్టి సారించాలని అనుకుంటున్నారు. అదే సమయంలో టీడీపీ ముఖ్య నేతలు ఉన్న నియోజకవర్గాలపైనా ఓ కన్నేశారు. కుప్పం, అద్దంకి.. టెక్కలి వంటి నియోజకవర్గాల సమీక్షల్ని పూర్తి చేస్తున్నారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ గాలిలోనూ గెలిచిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో సీఎం జగన్ సమీక్షలు చేస్తున్నారు. నియోజకవర్గాల సమీక్షల్లో మొట్టమొదటగా కుప్పంనే ఎంచుకున్నారు. ఆ తర్వాత సమీక్షల్లో గ్యాప్ వచ్చినప్పటికీ.. వరుసగా టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గ నేతలను పిలుస్తున్నారు. కనీసం వారానికో నియోజకవర్గాన్ని అయిన జగన్ సమీక్షిస్తున్నారు. ఇప్పటికే కుప్పంతో పాటు అద్దంకి నియోజకవర్గ సమీక్ష కూడా పూర్తయింది. బుధవారం ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నేతృత్వం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. ప్రతి నియోజకవర్గం నుంచి దాదాపుగా వంద మందికి ఆహ్వానం పలుకుతున్నారు. తెలుగుదేశం పార్టీలో బలంగా ఉన్నారని అనుకుంటున్ననేతల్ని అసెంబ్లీకి రాకుండా చేయాలని జగన్ పట్టుదలతో ఉన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన నేతలను మరోసారి ఓడించాలని.. భావిస్తున్నారు. దేవినేని ఉమ, బొండా ఉమ, యరపతినేని శ్రీనివాస్ సహా పలువురు నియోజకవర్గాలపై జగన్ వ్యక్తిగతంగా దృష్టి పెట్టారు. అక్కడ మళ్లీ గెలవడానికి ఏం చేయాలో ఎప్పటికప్పుడు సందేశాలు పంపుతున్నారు. పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలందర్నీ ఓడిస్తే..

సగం పని అయిపోతుందని.. మిషన్ 175కి చేరుకోవచ్చని జగన్ అంచనా వేస్తున్నట్లుగా వైఎస్ఆర్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి.ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని చెప్పి.. మరోసారి ఎన్నుకునేలా ..వైఎస్ఆర్‌సీపీకే ఓటు వేసేలా ప్రజలకు విజ్ఞప్తి చేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మరో రెండు , మూడు నెలల్లో ప్రతి ఇంటికి పార్టీ నేతలు... ఎమ్మెల్యేలు.. ఇంచార్జులు తిరిగినట్లవుతుంది. అప్పుడు ప్రతి ఇంటికి ప్రభుత్వం వెళ్లినట్లవుతుంది. ఏపీ ఓటర్లలో సగం మందికిపైగా సంక్షేమ పథకాలు ఇస్తున్నామని వారంతా తమకు ఖచ్చితంగా ఓటు వేస్తారని జగన్ నమ్ముతున్నారు. అందుకే అన్ని నియోజకవర్గాల్లో గెలుపుపై నమ్మకంతో ఉన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఉన్న నియోజకవర్గాల్లోనూ మెజార్టీ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ దిశగా సక్సెస్ అవుతామన్న నమ్మకంతో వైఎస్ఆర్‌సీపీ క్యాడర్ ప్రజల్లోకి వెళ్తోంది.

## బయోమెట్రిక్ తో డాక్టర్ దంపతులు మెసాలు

గుంటూరు, అక్టోబరు 27,గుంటూరు జిల్లా తెనాలి జిల్లా ఆసుపత్రిలో వైద్య దంపతుల వ్యవహార శైలి పలు విమర్శలకు తావిస్తోంది. అసలే వైద్య సేవలు అంతంత మాత్రం అందిస్తున్నారని ప్రజలంతా భావిస్తుండగా.. ఇప్పుడు వైద్యులు సమయ పాలన పాటించడం లేదని అందరికీ తెలిసిపోయింది. వైద్యులు, వైద్య సిబ్బంది సరిగ్గా వస్తున్నారో లేరో తెలుసుకునేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వస్తే... దాన్ని కూడా తప్పుడు రీతిలో వాడుకున్నారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రయత్నాలతో పనులు ఎగ్గొట్టడం.. కానీ ఎగ్గొట్టినట్లు తెలియకుండా చేయడంలో మితిమీరిన వేషాలు వేస్తున్నారు. అందుబాటులోకి వచ్చి ఆధునిక సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ కొందరు వైద్యులు సరికొత్త అక్రమానికి తెరలేపారు. అదేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తెనాలి ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న వైద్య దంపతులు ప్లాస్టిక్ వేలిముద్రల సాయంతో హాజరు వేస్తున్నట్లు పైఅధికారులు గుర్తించారు. ఆ తర్వాత ఆసుపత్రికి రావడం లేదు. ప్లాస్టిక్ వేలి ముద్రలు చేయించి సెక్యూరిటీ సిబ్బందితో హాజరు వేయిస్తున్నారు. గైనకాలజిస్టుగా పని చేస్తున్న ఓ మహిళా వైద్యురాలు, ఈఎన్టీగా పని చేస్తున్న ఆమె భర్త ఇద్దరూ కొద్ది రోజులుగా ఇలా చేస్తున్నట్లు తేలింది. వైద్యుల మధ్య తలెత్తిన విభేదాలతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యం విచారణ చేపట్టగా.. సీసీ కెమెరాల ఆధారంగా అక్రమ హాజరు నిజమేనని నిర్ధరణకు వచ్చారు. ఆసుపత్రిలో వైద్యులకు, ఇతర సిబ్బందికి వేర్వేరుగా బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నాయి. వైద్యులు ఉపయోగించే యంత్రం వల్ల భద్రతా సిబ్బంది వేలి ముద్రలు వేస్తున్నట్లు సీసీ కెమెరాల్లో నమోదు అయింది. సిబ్బందిని పిలిచి విచారించగా.. నిజం ఒప్పుకున్నారు. దీంతో సెక్యూరిటీ సూపర్ వైజర్ ఫణి, గార్డు పుల్లయ్యను విధుల నుంచి తప్పించారు. వైద్యులకు నోటీసులు జారీ చేశారు. పొరుగు సేవల విధానంలో పని చేసే సెక్యూరిటీ ఏజెన్సీ సిబ్బందిపై వేటు వేయడం కంటి తుడుపు చర్య అని.. వైద్యులను రక్షించేందుకే ఇలా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర సచివాలయంలో సుమారు 10 శాతం మంది ఉద్యోగులు ఉదయం 11 గంటల తర్వాతే విధులకు హాజరవుతున్నట్టు తెలిసిందని.. అందుకే ప్రభుత్వ ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరి చేసింది. సచివాలయంలోని అన్ని విభాగాల్లోనూ 80 శాతం హాజరు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల కార్యదర్శులను ఆదేశించింది. ఈ విషయంపై ఇప్పటికే జారీ చేసిన నిబంధనలను ఇకపై తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఉద్యోగ విరమణ చేసిన, బదిలీ అయిన ఉద్యోగులకు సంబంధించిన వివరాలను బయోమెట్రిక్ పరికరాల నుంచి తొలగించాలని తెలిపింది. బయోమెట్రిక్ హాజరు నివేదికలను ప్రతీ నెల రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని ఆదేశించింది. ఇందుకు ఆయా శాఖ కార్యదర్శి ఉద్యోగుల హాజరును పరిశీలించాలని పేర్కొంది.ప్రభుత్వ ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేస్తూ ఏపీ సర్కార్ ఇప్పటికే మెమో విడుదల చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ బయోమెట్రిక్ అటెండెన్స్ పై ఆదేశాలు జారీ చేసింది. కొవిడ్-19 ఉద్ధృతి తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొన్న కారణంగా బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేసినట్లు మెమోలో వెల్లడించింది. రాష్ట్ర సచివాలయ ఉద్యోగులందరికీ ఐదు రోజుల పనిదినాల విధానాన్ని 2022 జూన్ వరకూ ప్రభుత్వం పొడిగించింది. ఉద్యోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ విధుల్లో ఉండాలని స్పష్టం చేసింది. సోమవారం నుంచి శుక్రవారం వరకూ ప్రతిరోజూ ఉద్యోగుల హాజరును పరిశీలించాలని ఆయా శాఖల కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చింది. ఉదయం 10 గంటల 10 నిముషాల అనంతరం విధులకు హాజరైతే ఆలస్యంగా వచ్చినట్లు పరిగణిస్తామని ప్రభుత్వం పేర్కొంది. నెలలో మూడు సార్లు మాత్రమే ఆలస్య హాజరు అనుమతిస్తామన్నారు. ఆ తర్వాత వేతనాల్లో కోత విధిస్తామని స్పష్టం చేసింది.

## నీట మునిగిన బోటు..ఒకరు మృతి

నరసాపురం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం , తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది సరిహద్దు వద్ద చేపల వేట బోటు నీట మునిగింది ఈ ఘటనలో నర్సాపురం మండలం బియ్యపు తిప్ప గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఒడుగు నాగరాజు గల్లంతయ్యాడు బోటులో ఉన్న లో మరో ఇద్దరు మత్స్యకారులు, తిరుమనీవులక్ష్మణస్వామి , ఒడుగు కొండలరావు లు ఈదుకుంటూ దరికి చేరారు. గల్లంతైన మత్స్యకారుడు కోసం సముద్ర ముఖద్వారం వద్ద గాలింపు చేపట్టారు.. బియ్యపు తిప్ప గ్రామం నుంచి నిన్న సాయంత్రం వీరు ముగ్గురు వేటకు బయలుదేరారు. తిరిగి వస్తుండగా బోటులో ఉన్న చేపల వల ఇంజన్ కు చుట్టుకోవడంతో ముందుకు కదల లేక బోటు తిరగబడింది . ప్రమాదాన్ని గుర్తించిన ముగ్గురు మత్స్యకారులు సముద్రంలోకి దూకేశారు. అయితే ఒడుగు నాగరాజు మాత్రం నీటి ఉధృతకు ఈదలేక గల్లంతయిపోయాడు. కళ్ళ ముందే కొడుకు కొట్టుకుపోతున్న చూస్తూ రక్షించలేకపోయానని తండ్రి ఓడుగు కొండలరావు కన్నీటి పర్యంతమయ్యాడు.

## నవంబర్ 11న విశాఖకు ప్రధాని



విశాఖపట్టణం, అక్టోబరు 27, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ త్వరలో ఏపీలోని విశాఖపట్నం నగరానికి రానున్నారు. నవంబరు 11న విశాఖపట్నంలో ప్రధాని మోడీ పర్యటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. రూ.400 కోట్లతో చేపట్టనున్న విశాఖపట్నం రైల్వేస్టేషన్ నవీకరణ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వివరాలు అందినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టనున్న మరికొన్ని ప్రాజెక్టులకు, పూర్తయిన అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరం వైజాగ్‌లో జరగనున్న బహిరంగ సభలో కూడా ప్రధాని ప్రసంగించనున్నారు. ఈ బహిరంగ సభను ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయాలని యంత్రాంగం భావిస్తోంది. ప్రధాని పర్యటనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు. ప్రధాని పర్యటన, చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, ఇతర అధికారులు మంగళవారం ప్రాథమికంగా చర్చించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో బీజేపీ శ్రేణుల్లో కూడా నూతనుత్సాహం నెలకొందిరాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము డిసెంబరులో విశాఖలో పర్యటించనున్నారు. డిసెంబరు 4న తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నౌకా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొంటారని సమాచారం.

## జగన్ తో వర్మ భేటీ ..అందుకేనా

విజయవాడ, అక్టోబరు 27, ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌తో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సమావేశం అయ్యారు. అమరావతి తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసంలో ఆయన్ను వర్మ కలిశారు. ఈ సందర్భంగా దర్శకుడు వర్మకు సీఎం జగన్ లంచ్ ఆతిథ్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. సుమారు 40 నిమిషాల పాటు జగన్, రామ్‌గోపాల్ వర్మ సమావేశం సాగింది. అనంతరం జగన్ నివాసం నుంచి వర్మ బయటకు వచ్చారు. అయితే జగన్‌తో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సమావేశం కావడం ఇప్పుడు రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.అయితే వీళ్లిద్దరూ ఎందుకు కలిశారు? ఏం మాట్లాడుకున్నారు? అనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది. అయితే రానున్న ఎన్నికల నేపథ్యంలో త్వరలో మూడు రాజధానుల అంశం లేదా చంద్రబాబు వెన్నుపోటు అంశంపై వర్మ సినిమా తీసే అవకాశం ఉందని సమాచారం అందుతోంది. మరోవైపు ఏపీలో సినిమా రంగానికి సంబంధించి పలు అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా గతంలో సినిమా టికెట్ల వివాదంలో మంత్రి పేర్నినానితో ఆర్జీవీ ప్రత్యేకంగా సమావేశమైన విషయం తెలిసిందే.

## ఏపీలో ఫేక్ పాలిట్రిక్స్

విజయవాడ, అక్టోబరు 27, ఏపీ రాజకీయాలు రాను రాను ఎవరూ ఊహించని విధంగా మారిపోతున్నాయి. బండ బూతులు తిట్టుకుని , కుటుంబాలనూ సోషల్ మీడియాకు ఈడ్చుకుంటున్న పార్టీలు ..సోషల్ మీడియా మొత్తాన్ని ఫేక్ పోస్టులతో నింపేస్తున్నాయి. నిన్నామొన్నటి వరకూ ఫేక్ వార్తలతో పోస్టులు పెట్టి విమర్శలు చేయడం వరకే ఉండేది ఇప్పుడు పూర్తిగా ట్రెండ్ మారిపోయింది. ఓ పార్టీ సానుభూతిపరుల పేరుతో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి కులపరమైన పోస్టులు పెట్టి రెచ్చగొడుతున్నారు. టీడీపీ, జనసేన దగ్గరవుతున్న సూచనలు కనిపించడంతో ఈ తరహా పోస్టింగ్‌లు ఎక్కువైపోయాయి. రెండు ప్రధాన సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు పోస్టింగులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. దీనిపై చివరికి నారా లోకేష్ కూడా స్పందించాల్సి వచ్చింది. ఏపీలో రాజకీయ పరిస్థితులు ఊహించని విధంగా మారుతున్నాయి. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిశారు. సీఎం జగన్‌ను దింపేందుకు కలిసి పని చేస్తామని ప్రకటించారు. పొత్తులు పెట్టుకుంటామని చెప్పలేదు కానీ.. వారు కలిసి పోటీ చేస్తారని రాజకీయ పార్టీల్లో బలమైన అభిప్రాయం ఏర్పడింది. అప్పట్నుంచి ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే రాజకీయం ఎలా మారిపోతుందోనన్న చర్చ ప్రారంభమయింది. ఆ వెంటనే సోషల్ మీడియాలో.. ఈ రెండు పార్టీలకు అండగా ఉంటాయనుకున్న సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టేలా పెద్ద ఎత్తున పోస్టులు కనిపించడం ప్రారంభించాయి. ఈ పోస్టులు పెడుతోంది.. ఎవరో కానీ.. అందులో ఉన్న హ్యాండిల్స్ మాత్రం.. టీడీపీ లేదా జనసేన మద్దతు దారులన్నవట్లుగా ఉన్నాయి. టీడీపీ యువ నేత నారా లోకేష్ పేరుతో ఓ ట్విట్టర్ అకౌంటర్ కొత్తగా క్రియేట్ అయింది. అందులో రెండు సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టేలా పోస్టింగ్ పెట్టారు. ఇది నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ అకౌంట్‌ను క్రియేట్ చేసింది ఐ ప్యాక్ వాళ్లని.. వైసీపీ ఎంతకైనా దిగజారుతుందని..కానీ అవి జగన్‌ను ఓటమి నుంచి కాపాడలేవని హెచ్చరించారు. కాసేపటికే ఆ ట్విట్టర్ హ్యాండిల్ డీ యాక్టివేట్ అయింది. ఇలాంటివి చాలా అకౌంట్లు రెడీ చేశారని.. వైఎస్ఆర్‌సీపీ ఐ ప్యాక్ కార్యకర్తలు.. ఇలాంటివి ..రెండు సామాజికవర్గాల మధ్య చిచ్చు పెట్టేలా క్రియేట్ చేస్తున్నారని టీడీపీ నేతలంటున్నారు. సోషల్ మీడియా విస్తృతి పెరిగిన తర్వాత రాజకీయం వెర్రి తలలు వేస్తోంది. టీడీపీ సానుభూతి పరుల పేర్లు.. అలా కనిపించే ట్విట్టర్, ఫేస్ బుక్ హ్యాండిల్స్ ద్వారా కులపరమైన పోస్టులు పెడుతున్నారు. చూస్తే నిజంగానే టీడీపీ వాళ్లు పెట్టారేమో అనేలా ఉంటాయి. అలా పెట్టే పోస్టులు జనసేన అధినేత పవన్ కల్యాణ్ లేదా చిరంజీవిని లేదా వారి సామాజికవర్గాన్ని అవమానించేలా ఉంటాయి. అప్పుడు రెండు పార్టీల మధ్య చిచ్చు ఏర్పడుతుందని.. వారి వ్యూహం అని టీడీపీ, జనసేన వర్గీయులు అంటున్నారు. సోషల్ మీడయా ద్వారా ఇలాంటివి చేస్తే వారి ఓట్లు కలవవని.. పొత్తు పెట్టుకున్న ప్రయోజనం ఉండదనేలా చేయాలనుకుంటున్నారని టీడీపీ వర్గాలంటున్నాయి. తెలుగుదేశం, జనసేన పార్టీలు పొత్తులు పెట్టుకుంటే వైసీపీ గడ్డు పరిస్థితి ఎదురవుతుందని అందుకే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని.. టీడీపీ, జనసేన నమ్ముతున్నాయి. అందుకే అలాంటి పోస్టులపై పూర్తి స్థాయిలో నిజానిజాలను వెల్లడించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

## చిన్నమ్మ ఆచితూచి అడుగులు



ఒంగోలు, అక్టోబరు 27, దగ్గుబాటి పురంద్రీశ్వరి ఆమె కుమారుడి రాజకీయ భవిష్యత్ కు కూడా అడ్డంకిగా మారారు. వాళ్లు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. బీజేపీలో పురంద్రీశ్వరి క్రియాశీలకంగా ఉన్నారు. కొంత వెయిట్ చేస్తే కేంద్ర మంత్రి పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే ఎప్పుడు? ఎలా? అనేది చెప్పలేం. వచ్చే ఎన్నికల్లో లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే సులువుగా కేంద్రమంత్రి పదవి దక్కుతుందన్న నమ్మకంతో చిన్నమ్మ ఉన్నారు. లేకుంటే రాజ్యసభకు ఎంపిక చేసైనా తనకు బీజేపీ కేంద్ర నాయకత్వం కేంద్ర మంత్రిగా బాధ్యతలను అప్పగిస్తుందన్న విశ్వాసంతో పనిచేస్తున్నారు. దగ్గుబాటి మాత్రం... అయితే ఇదే సమయంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకున్నట్లే. ఆయన గత ఎన్నికలలో వైసీపీ అభ్యర్థిగా పర్చూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజకీయాలకు, పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇక రాజకీయాల్లోకి ఆయన వచ్చే అవకాశం లేనట్లే. పొలిటికల్ రిటైర్‌మెంట్ తీసుకున్నట్లేనని దగ్గుబాటి వెంకటేశ్వరరావు సన్నిహితులు చెబుతున్నారు. అయితే దగ్గుబాటి తన తనయుడి రాజకీయ భవిష్యత్ పైనే బెంగపెట్టుకున్నారు. తన కుమారుడిని ఎమ్మెల్యేగా చూడాలని ఆయన కలలు కంటున్నారు. చంద్రబాబుతో ఇటీవల చంద్రబాబుతో కొంత సఖ్యత కుదిరింది. తెలుగుదేశం పార్టీ నుంచి హితేష్ ను రాజకీయ అరంగేట్రం చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై ఆలోచన చేస్తున్నారు. నందమూరి కుటుంబ సభ్యులు కూడా హితేష్ ను టీడీపీలోకి తీసుకువచ్చి కుటుంబమంతా ఒక్కటేనని చాటాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల దగ్గుబాటి అనారోగ్యానికి గురయినప్పుడు కూడా చంద్రబాబు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వచ్చారు. దీంతో రెండు కుటుంబాల మధ్య సఖ్యత కుదిరింది. ఈ నేపథ్యంలో హితేష్ ను తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. అయితే బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు కుదిరేట్లు లేదు. జనసేనతో పొత్తు కుదిరినా టీడీపీతో కలసి నడిచేందుకు బీజేపీ మాత్రం సిద్ధంగా లేనట్లే కనిపిస్తుంది. టీడీపీతో మరోసారి పొత్తు పెట్టుకుని తమ పార్టీని బలహీనం చేసుకోవాలన్న యోచనలో ఆ పార్టీ కేంద్ర నాయకత్వం లేనట్లేకనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో పురంద్రీశ్వరి బీజేపీలో క్రియాశీలకంగా ఉండాలంటే హితేష్ ను టీడీపీ నుంచి బరిలోకి దింపడం కరెక్ట్ కాదేమోనన్న ఆలోచనలో ఉన్నారు. హితేష్ కూడా తల్లికి ఈ సారి అవకాశం ఇవ్వాలన్న యోచనలో ఉన్నారని చెబుతున్నారు. కుటుంబంలో హితేష్ పోటీపై పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. అయితే చిన్నమ్మ పదవికి హితేష్ అడ్డంకి అవుతారా? హితేష్ రాజకీయ ప్రవేశానికి తల్లి పురంద్రీశ్వరి అవరోధంగా మారుతుందా? అన్నది భవిష్యత్ లో తేలాల్సి ఉంది.

## కొత్త కలెక్టరేట్ లో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేసిన నీలి శ్రీనివాసరావు

కడప కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు కడప కలెక్టరేట్ లో ప్రజల సౌకర్యార్థం గురువారం సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. నిత్యం అనేక సమస్యలతో అధికారులను కలవడానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు కడప కలెక్టరేట్ కు వస్తూ ఉంటారని, అటువంటి వారి కోసం కనీసం కూర్చునే సదుపాయం ఏర్పాటు చేయడం తనకు సంతోషంగా ఉందని శ్రీనివాసరావు తెలిపారు. బెంచీలు ఏర్పాటు చేసిన నీలిని స్థానిక ప్రజలు అభినందించారు. కలెక్టరేట్లోనే కాకుండా, ప్రజలు ఎక్కువగా గుమిగూడె ప్రాంతాలలో బెంచీలను ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీనివాస్ రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగానే కాకుండా సామాన్య ప్రజలలో ఒకడిగా ప్రజల బాధలు అర్థం చేసుకున్నాను కాబట్టే ఈ సేవా కార్యక్రమానికి పూనుకున్నానని శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు తోపాటు, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, , కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు

## నందకుమార్ కు గులాబీతో సంబంధాలు

హైదరాబాద్, అక్టోబరు 27, తెలంగాణలో అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను కొనుగోలు చేసేందుకు యత్నించిన వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది.. మొయినాబాద్ ఫాంహౌస్ వ్యహారంలో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్ స్పందించారు. నంద కుమార్ కి టీఆర్ఎస్ నేతలకు సంబంధాలు ఉన్నాయని ఆయన బీజేపీకి ఎలాంటి సంబందం లేదని తేల్చిచెప్పారు. సీబీఐ లేదా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆ ఎమ్మెల్యేలలో ముగ్గురు కాంగ్రెస్ నుండి టీఆర్ఎస్ కి వచ్చిన వారే అని లక్ష్మణ్ తెలిపారు. వారిని అప్పుడు ఎంతకు కొన్నారు? అంటూ ప్రశ్నించారు. మునుగోడులో ప్రజలు తమ వైపు లేరనే టీఆర్ఎస్ ఇదంతా చేస్తుందని, నంద కుమార్ కి టీఆర్ఎస్ నేతలకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. బీజేపీ నైతిక విలువలకు కట్టుబడి ఉన్న పార్టీ అని బీజేపీ పార్టీ పైన బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు నమ్మరని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్ తెలిపారు. మొయినాబాద్ ఫాంహౌస్ వ్యహారంలో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేశారు సైబరాబాద్ పోలీసులు.. అయితే, ఆ నలుగురిలో ఒకరైన తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫిర్యాదుతోనే పోలీసులు రంగ ప్రవేశం చేసినట్టు చెబుతున్నారు.. మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి.. దీంతో.. కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేశారు పోలీసులు.. బీజేపీలో చేరేందుకు 100 కోట్ల రూపాయల డీల్ నడిసినట్టు తన ఫిర్యాదులో పేర్కొన్నారు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి.. ఎమ్మెల్యేలను తీసుకొస్తే 50 కోట్ల రూపాయలు ఇస్తామని తనతో డీలింగ్ నడిచినట్లు పేర్కొన్న యాన.. స్వామిజీ, నందు, సతీష్ కలిసి తనను బీజేపీలో చేరాలని ఒత్తిడి తెచ్చినట్లు పేర్కొన్నారు.. డీలింగ్‌లో భాగంగానే తన ఫామ్ హౌస్ కు వచ్చారని ఫిర్యాదులో తెలిపారు.. ఇక, రంగంలోకి దిగిన పోలీసులు.. ఆడియో రికార్డులు, వీడియో రికార్డులు, ఇతర ఆధారాలను కూడా సేకరించారు.. రాత్రే ఆ ముగ్గురిని అరెస్ట్ చేశారు.

# టీడీపీ, జనసేన వచ్చే ఎన్నికల్లో కలసి పోటీ..?

రాజమండ్రి, అక్టోబరు 27, నిన్న మొన్నటి వరకూ ఒక డౌట్ ఉండేది. పవన్ కల్యాణ్ టీడీపీతో కలసి నడుస్తారా? లేదో? అన్న అనుమానం ఉండేది. అయితే ఆ అనుమనాలన్నీ పటాపంచాలయి పోయాయి. ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఒక క్లారిటీ వచ్చింది. టీడీపీ, జనసేన వచ్చే ఎన్నికల్లో కలసి పోటీ చేస్తాయని నేతలు గట్టిగా నమ్ముతున్నారు. టీడీపీ, జనసేనలు కలిస్తే కొంత గెలుపునకు అవకాశాలున్న చోట్ల నేతలు పార్టీలు మారే అవకాశముందని తెలిసింది. కొందరు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు సంపాదించుకోవడం కోసం, మరికొందరు ఆ నియోజకవర్గాల్లో తాము కీలకంగా మారేందుకు ముందుగానే పార్టీలు మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పొత్తుల కోసమే ముందు నుంచి కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించలేదు. మిత్రపక్షాలకు వదిలిపెట్టాల్సిన స్థానాలను చంద్రబాబు ముందుగానే గుర్తించినట్లు కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఖచ్చితంగా టీడీపీ పోటీ చేసే స్థానాలకు సంబంధించి మాత్రమే ఆయన నిన్న మొన్నటి వరకూ సమీక్షలు చేశారు. మిత్రపక్షాలు కొంత బలంగా ఉన్న ప్రాంతాలను ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదన్న చర్చ టీడీపీలో నడుస్తుంది. అయితే ఇప్పుడు టీడీపీలో చేరి టిక్కెట్ పొందడమా? జనసేనలో చేరి టిక్కెట్ సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడమా? అన్న ఆలోచనలో కొందరు నేతలున్నారని తెలిసింది స్థానిక సంస్థల ఎన్నికల్లో... స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల జనసేన, టీడీపీ అనధికారికంగా పొత్తు కుదుర్చుకుంది. కొన్ని స్థానాలను దక్కించుకుంది. ఎన్నికలకు ముందే కొన్ని స్థానాల్లో, అనంతరం మరికొన్ని చోట్ల పొత్తు కుదుర్చుకుని కొన్ని స్థానాలను కైవసం చేసుకుంది. ప్రధానంగా పవన్ కల్యాణ్ తో జట్టు కుదుర్చుకుంటే యువత, కాపు సామాజికవర్గం ఓట్లు గంపగుత్తగా పడతాయని టీడీపీ నేతలు భావిస్తున్నారు. అయితే ఒకసారి తాము నియోజకవర్గాన్ని మిత్రపక్షాలకు వదులుకుంటే పట్టు కోల్పోతామని భావించిన నేతలు అవసరమైతే జనసేనలో చేరయినా టిక్కెట్ సాధించాలన్న యత్నంలో ఉన్నారని సమాచారం. ప్రధానంగా పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఈ జంప్ లు ఎక్కువగా ఉంటాయని తెలిసింది. నేతలు మరో ఆలోచన కూడా చేస్తున్నారు. జనసేన, టీడీపీ అధికారంలోకి వస్తే మంత్రి వర్గంలో లెక్కలు కూడా వేసుకుంటున్నారు. టీడీపీలో ఉంటే మంత్రి పదవులు దక్కవని భావించిన కొందరు నేతలు జనసేనలోకి వెళ్లి పోటీ చేసి గెలిచి మంత్రి అయి తమ కలను నెరవేర్చుకోవాలని భావిస్తున్నారు. అందులో సీనియర్ నేతలు కూడా ఉన్నారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ కు టచ్ లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకే త్వరలోనే జనసేనలోకి భారీగా చేరికలు ఉంటాయని చెబుతున్నారు. టీడీపీ, కాంగ్రెస్ అక్కడక్కడ వైసీపీ నుంచి కూడా నేతలు ఆ పార్టీని వీడి జనసేనలో చేరే అవకాశముందని తెలుస్తోంది. అయితే ఇందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది.

## భూ తగాదాల్లో ఘర్షణ

కర్నూలు కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలం కంపాడు బాపురంలో భూ తగాదాల్లో విషయంలో కుటుంబ సభ్యులు కారం పొడి చల్లి రాళ్లు, కట్టెలతో ఇరు వర్గాలు దాడులు చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన ఆరుగురుకి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికల మిస్సింగ్ ఉదంతం సుఖాంతం

కడప గంటల వ్యవధిలోనే ముగ్గురు బాలికల మిస్సింగ్ కేసును జమ్మలమడుగు పోలీసులు చేధించారు. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు ప్రొద్దుటూరుకు చెందిన ఒక బాలిక మిస్సింగ్ అయ్యారు. ఈనెల 25వ తేదీన కనబడుటలేదని బాలికల బంధువులు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు మేరకు జమ్మలమడుగు సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సింహాద్రిపురం మండలం లో మడ చర్చి వద్ద బాలికలను పోలీసులు కనుగొన్నారు. తల్లిదండ్రులు మందలించడంతో పారిపోయినట్లు వెల్లడించారు.

## వామపక్ష నేతల ముందస్తు అరెస్టు

నెల్లూరు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసులు పలువురు వామపక్ష నేతలను ముందస్తు అరెస్టు చేసారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. జెన్కో ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష నేతల నిరసనలకు దిగుతున్నారని సమాచారం. సీఎం పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తారని ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు కొనసాగాయి.

# మిగిలిన హామీల సంగతేంటీ...

విజయవాడ, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)ప్రధాని నరేంద్రమోదీ నవంబర్ 11న ఆంధ్రప్రదేశ్ పర్యటించనున్నారు. ప్రధాని రాక కోసం ముఖ్య మంత్రి జగన్ కంటే ప్రజలే ఎక్కువ ఆసక్తితో ఎదురుచూస్తున్నారనాలి. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచీ అప్పటి హామీలను కేంద్రం నాన్చుతూనే ఉంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, భోగాపురం విమానాశ్రయం వంటివి తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు వైజాగ్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల శంకుస్థాపన ప్రధాని పర్యటనలో కీలకంగా పేర్కొన్నారు. అయితే రాష్ట్రప్రజలు మాత్రం ముఖ్యమంత్రి జగన్ ఈ అవకాశాన్ని ఎంతవరకూ ఉపయోగిం చుకుని రాష్ట్రానికి మేలు చేస్తారన్నది ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఆయన సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలపై ఏపీ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. నవ్యాంధ్ర రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేసిన ఆయన ఇప్పుడు జగన్ సర్కార్ మూడు రాజధానులంటూ చేస్తున్న హడావుడినీ, సృష్టిస్తున్న అరాచకాన్ని నియంత్రించేందుకు ఏం చర్యలు తీసుకోబోతున్నారన్న విషయంపై ఏపీ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే మూడు రాజధానులపై రాష్ట్రంలో ప్రాంతీయ విద్వేషాలు పెచ్చరిల్లేలా వైసీపీ నేతలు, మంత్రుల ప్రకటనలై.. అసలు మూడు రాజధానులపై కేంద్రం వైఖరి ఏమిటన్నది స్పష్టం చేసిన తరువాతనే ఆయన ఏపీ పర్యటనకు రావాలని ఏపీ జనం డిమాండ్ చేస్తున్నారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోతే జరిగే పరిణామం ఎలా ఉంటుందనేది ఆంధ్రప్రదేశ్ ప్రజలు సీఎం జగన్ కు తెలియజేశారు. మూడేళ్ల పాలన తర్వాత ఆయన్ను వద్దనే అంటున్నారు. పాలనాపర నిర్ణయాలంటూ ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం తప్ప ప్రత్యేకించి చేసిందేమీ లేదన్నది ప్రజల నుంచి వస్తున్న మాట. పైగా రాజధాని విషయంలోనూ ప్రజలు, రైతులు తిరగబడుతున్నారు. ప్రధాని మోదీ వద్దకు అనేక పర్యటనలు చేసిన జగన్ సాధించిందీ, తెచ్చిందీ ఏమీ లేదు. ఆఖరికి విశాఖ రైల్వేజోన్, విషయం తేల్చలేకపోయారు. కేవలం సమావేశాలతోనే కాలం గడిచిపోయింది. మంచి అవకాశాల్ని దుర్వినియోగం చేసుకు న్నారని కేవలం ఫోటోలకే సమావేశాలను ముగించేశారన్న అపవాదు జగన్ మూటగట్టుకున్నారు. అవన్నీఅయిపోయా యి. గతం గత: అనుకున్నప్పటికీ, ఇప్పుడు మరో మంచి అవకాశం వచ్చింది. వైజాగ్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ శంఖుస్థాపనకు ప్రదాని మోదీ వస్తున్నారు. సుమారు 400 కోట్ల రూపాయలతో వైజాగ్ రైల్వే స్టేషన్ ను ఆధునీకరించను న్నారు. ఈ పని 2024 సంవత్సరానికి పూర్తి అవుతుంది. ఇది వదులుకోవడానికి వీలులేని అవకాశం. ప్రధానితో రాష్ట్ర సమస్యలు చర్చించి పరిష్కరించు కోవాల్సిన సమయం. దీన్ని అందిపుచ్చుకుని ప్రజల ఆశలు ఫలించేట్టు చేయాల్సిన బాధ్యత సీఎం జగన్ చేపట్టాలి. పైగా విశాఖలో బీజేపీ పార్టీ నూతన కార్యాలయానికి కూడా ప్రధాని శంఖుస్థాపన చేస్తారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఆ ఆనంద సమయంలోనే రైల్వేజోన్ విషయంలో చర్చించి స్పష్టత సాధిస్తారని ప్రజలు ఎంతగానో ఆశిస్తున్నారు. చాలాకాలంనుంచీ నానుతున్న రైల్వేజోన్ అంశంతోపాటు భోగాపురం విమానాశ్రయం, గిరిజన విశ్వ విద్యాలయం నిర్మాణపనులకు ప్రధానితో శంఖుస్థాపన చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేయాలి. కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలు పూర్తి చేసుకునేందుకు కాకుండా రాష్ట్ర ప్రగతికి ఉపకరించే పనుల గురించి కూడా ప్రధానిని పట్టుబట్టి అంగీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రధాని మోదీని పలుమార్లు కలిసినా సాధించలేని పనులు గురించి ప్రజల నుంచి వచ్చిన విరక్తి, వ్యతిరేకతల నుంచీ బయటపడాలంటే మోదీ చేత రాష్ట్రానికి రావలసిన వన్నీ సాధించాలి. అయితే మోదీ మరి జగన్ మాట విని అన్నింటికీ అంగీకరిస్తారా అన్నది అనుమానమే. రాజకీయ వ్యూహాల ప్రకారం వ్యవహరిస్తూ, బీజేపీ ని దేశంలో తిరుగులేని పాలనాధికారం గల పార్టీగా విస్తరించడంలో నిమగ్నమయిన బీజేపీ సీనియర్లు, ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ అవసరాలను, రాష్ట్రానికి ఇచ్చిన హామీలను వెంటనే అంగీకరించి నెరవేరేందుకు పూర్తిస్థాయిలో సహాయపడగలరన్నదీ అనుమానమే. అన్నింటినీ రాజకీయ కోణంలోనే ?లోచించే కేంద్ర నాయకులు జగన్ కోరికను అంగీకరించి సానుకూలంగా స్పందించినంత మాత్రాన అన్ని జరిగిపోతా యనుకోవడమూ పొరపాటే. అయితే ఇప్పుడీ అవకాశాన్ని, ప్రధానిని బతిమిలాడి బామాడి సాధించుకోవా ల్సిన అంశా ల్లో ఏమాత్రం విఫలమయినా తెలుగు ప్రజలు జగన్ ను పూర్తిగా విస్మరించి అధికారాన్నించి దించే అవకాశాలే ఉన్నాయి. ఇప్పటివరకూ కేంద్రంతో తమకు అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయని వైసీపీ నేతలు, ముఖ్య మంత్రి ప్రచారం చేసుకుంటూ వచ్చారు. ఇప్పుడు స్నేహసంబంధం విషయంలో అసలు రంగు బయటపడుతుంది. ఏపీకి కేంద్రం ఇస్తామని చెప్పిన రైల్వే జోన్ పై కేంద్రం దోబూచులాడుతోంది అనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. ఒకసారి కొత్త రైల్వేజోన్ లేదని చెబుతూనే మరోవైపు ఏపీకి రైల్వే జోన్ ఖచ్చితంగా ఏర్పాటవుతుంది అని చెబుతూ వస్తుంది. అయితే దానికి సంబంధించిన ఏర్పాట్ల విషయం లో మాత్రం ఎటువంటి ముందడుగు వేయడం లేదు. దానితో స్వయంగా ప్రధాని మోదీనే విశాఖకు వస్తున్న సమయంలో, అదీ కూడా రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కు సంబంధిం చిన విషయంలో కనుక ఆయన రైల్వే జోన్ పై కూడా స్పష్టత ఇస్తారా అనే దానిపై రాష్ట్ర ప్రజలలో ఉత్కంఠ నెలకొంది. విశాఖ ప్రజల సెంటిమెంట్ వైజాగ్ స్టీల్ ప్లాంట్ను ప్రేవేటీకరణ చెయ్యొద్దు అంటూ ఉక్కు కర్మాగారం కార్మికులు, ఉద్యోగులు నిరసనలు తెలియజేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో విశాఖలో ప్రధాని మోదీ అడుగుపెడుతున్న వేళ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ రద్దు పై అనుకూలంగా స్పందిస్తారా అని ఉత్తరాంధ్ర ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఆ దిశగా మోదీ ఏమైనా స్పందిస్తారేమో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# పన్నులు రద్దు చేసే వరకు పోరాటాలు చేద్దాం

**నగర ప్రజలకు అండగా ఉంటాం**

**రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్ష నేతలు**

కడప రాష్ట్రంలో ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల మీద పెద్ద ఎత్తున బారాలు మోపుతోందని దీనికి వ్యతిరేకంగా ప్రజానీకం పోరాటాలకు సిద్ధపడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జి చంద్ర శేఖర్, టిడిపి కడప నియోజకవర్గ ఇన్చార్జి వియస్ అమీర్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్యలు పిలుపునిచ్చారు గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో చెత్త పన్ను పోరాట కమిటీ (సిపిసి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశం కన్వీనర్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఇందులో ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను, నిత్యవసర వస్తువుల ధరలను, పట్టణ ప్రాంతాల్లో యూజర్ చార్జీల పేరుతో రకరకాల భారాలను మోపుతోందని తీవ్రంగా విమర్శించారుఈ భారాల కారణంగా ప్రజలు నిత్య జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. ప్రభుత్వ విధానాలకు, పన్నుల భారాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకాన్ని పెద్ద ఎత్తున కూడగట్టే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారుసంస్కరణల పేరుతో ప్రజల మీద భారం మోపడమే రాష్ట్ర ప్రభుత్వ విధానంగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ పట్టణాల్లో సంస్కరణల్ని వేగంగా అమలు చేస్తూ చెత్త సేకరణ కోసం ప్రత్యేక యంత్రాంగం పెట్టామని చెబుతూ యూజర్ చార్జీల పేరుతో ఇష్టానుసారంగా భారం వేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణ లను బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అమలు చేయడం లేదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వీటిని వేగవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తుందని ఆరోపించారు ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, సత్తార్, , తిరుమలేష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, లక్ష్మి రెడ్డి, జి. చంద్రశేఖర్, సిపిఐ జిల్లా నాయకులు సావంత్ సుధాకర్, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, కృష్మా రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జోగిరామిరెడ్డి, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సిఆర్వి ప్రసాద్, బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, అమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, లోక్సత్తా పార్టీ నాయకులు కృష్ణదేవరాయలు, రైతు రాజ్యం రాష్ట్ర అధ్యక్షులు గర్రప్ప, బీఎస్పీ నాయకులు సగిలి గుర్రప్ప, ఎస్సీ , ఎస్టీ హ్యూమన్ రైట్స్ రాయలసీమ కన్వీనర్ జెవి రమణ, కడప నగర వస్త్ర వ్యాపారుల సంఘం నాయకులు శ్రీరాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, ఓబులేసు, టీడీపీ నేతలు ఇమ్రాన్, బాలదాసు, శంకర్ రెడ్డి, మహిళా సంఘం నాయకులు వసంతకుమారి, జమీలా, షకీలా, ఖజాబీ, యువజన సంఘం నాయకులు విజయ్, శివ, పెన్షనర్ల సంఘం నారాయణా రెడ్డి, కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణయ్య, కార్యదర్శి దస్తగిరి రెడ్డి, బిఎస్పీ నగర అధ్యక్షులు వర కుమార్, నాయకులు చెన్నయ్య సిపిఎం నాయకులు మహబూబ్ తార పాల్గొన్నారు

## సంస్కృతీ, సాంప్రదాయాలు గొప్పవి

కడప మన సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్ప వని, కళాకారులు మన సంప్రదాయాలకు రాయబారులుగా నిలుస్తారని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మానస కె. చిన్నప రెడ్డి అన్నారు. కడప నగరంలోని చిన్నచౌకులో గురువారం చిన్నతోట పద్మాకర్, నందిమండలం అఖిల్ మాస్టర్లు ఏర్పాటుచేసిన మిస్పా డాన్స్ అకాడమీని ఆయన ఇతర లయన్స్ మిత్రులతో కలిసి ప్రారంభించారు. కళాకారులను ప్రోత్సహిస్తే మనవైన సంస్కృతి సంప్రదాయాలను రక్షించుకొన్నవారమౌతామని ఇలాంటి కార్యక్రమాలకు తమవంతు సహకారం తప్పక ఉంటుందని ప్రతిభను నిరూపించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోతుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ నృత్యం అటు ఆరోగ్యంతో బాటు ఆలోచనాధోరణిని మార్చగలదన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష కార్యదర్శులు డా. ఆర్. రంగనాథ రెడ్డి, వి. గౌరి శంకర్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజులు మాట్లాడుతూ యువత సంప్రదాయాలకు దూరం గాకుండా వాటి ఆధారంగానే ఉపాధి కల్పించుకోవడం జిల్లా ప్రతిష్ఠను పెంచడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకులు పద్మాకర్, అఖిల్ మాస్టర్లు మాట్లాడుతూ సంస్థలో శిక్షణ పొందిన వారికి యం టివి ఛానెళ్ళు నిర్వహించే టీవి షోలలో అవకాశం కల్పిస్తామని ఇప్పటికే పాతిక మందికి పైగా ఉన్నతస్థాయి కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో తొలుత దేవుళ్ళ చిత్రపటాలవద్ద పూజలు నిర్వహించి లాంఛనంగా నృత్యశిక్షణను ప్రారంభించారు.

## కొర్లగుంట రోడ్ వెడల్పుతో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

**- మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి**

**ప్రజాభివృద్ధి కొరకు ఎన్ని ఇబ్బందులైన ఎదుర్కొంటాము**

**- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి**

తిరుపతి తిరుపతి కొర్లగుంట మెయిన్ రోడ్ విస్తరణ పనులను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కొర్లగుంట మారుతి నగర్ ప్రధాన రోడ్డు విస్తరణ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ 7 వందల మీటర్ల పొడుగుతో 40 అడుగుల వెడల్పుతో రూపుదిద్దుకుంట్టున్న ఈ రోడ్డు వలన వేలాది మంది ప్రజలు ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి పొందుతారని తెలిపారు. రహదారి విస్తరణకు అడ్డుగా వున్న 193 ఇళ్ళను గుర్తించి రోడ్డును వెడల్పు చేసే ప్రక్రియలో 60 మందికి పైగా టిడిఆర్ బాండ్లను అందజేసామని, మరో 50 మందికి టిడిఆర్ బాండ్లు ఇచ్చేందుకు సిద్దమైనట్లు, అదేవిదంగా మిగిలిన వారికి నష్ట పరిహారం క్రింద ఇవ్వవల్సిన టిడిఆర్ బాండ్లను త్వరితగతిన సిద్దం చేస్తున్నట్లు మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ తెలియజేశారు. భవనములు తొలగించిన వెంటనే తిరుపతి నగరము నందు ఈ రోడ్డును మోడల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డుకు, డ్రైన్ లకు ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ కొర్లగుంట ప్రధాన రహదారి విస్తరణకు ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజాభివృద్ధి కోసం ముందుకెల్లి విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కొర్లగుంట మెయిన్ రోడ్డు 40 అడుగులతో విస్తరించడం వలన ప్రజలు అనేక రకాల ఇబ్బందుల నుండి బయట పడుతారని, ఇంతకు ముందు చిన్నపాటి అంబులెన్స్ రాలేని స్థితి నుండి అనేక వాహనాలు వచ్చేందుకు మార్గం తేలికగా ఏర్పాటు అవుతుందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. మరో మూడు నెలల్లో ఈ రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రజలు, అధికారుల కృషితో పని చేస్తున్నట్లు అభినయ్ స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీరు తిరుమాలిక మోహన్, స్థానిక కార్పొరేటర్ అమర్నాథ్ రెడ్డి, కార్పొరేటర్ నరసింహాచారి, మునిసిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు మట్లి వెంకటరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డిఈ సంజయ్ కుమార్, సర్వేయరులు దేవానంద్, మురళీకృష్ణ, ప్లానింగ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం కదిలిన "కోట్ల" దండుసహనం కోల్పోతే సమరమే!

--- మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి





కర్నూలు గత నెలరోజుల క్రితం భారీ వర్షాలకు కర్ణాటక ప్రాంతంలో హగరి నది వంతెన పిల్లర్లు రెండు చీలిక ఏర్పడి కూలిపోవడంతో నీటి ప్రవాహాన్ని అధికారులు మళ్లించడంతో కర్నూలు జిల్లా వైపు రావలసిన నీరు ఆగిపోవడంతో అన్నదాత రైతన్నలు ఆందోళనకు గురయ్యారు. దీంతో మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ శాసన సభ్యురాలు తెలుగుదేశం పార్టీ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ లు రైతన్నల కోసం, త్రాగు నీరు,సాగునీరు సాధన కోసం కర్ణాటక ప్రభుత్వం పై గర్జించడానికి హగరి నది వంతెన దగ్గరకు గురువారం కదిలారు.. కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల నుండి తెలుగుదేశం పార్టీ నేతలు, కోట్ల అనుచరులు 100 వాహనాలకు పైగా తరలి వెళ్లారు. మార్గమధ్యలో కర్ణాటక రైతులు ఆయు కట్టు రైతులను ఆదుకోవాలని రోడ్డు దిగ్బంధంతో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు మాజీ కేంద్రమంత్రి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ లు మద్దతు పలికారు. అక్కడి నుండి కాలువల వెంట రైతులతో, కార్యకర్తలతో కలిసి నడిచారు.తుంగభద్ర బోర్డు ఇరిగేషన్ బ్రాంచి 121/00 కి.మీ. దగ్గర గల 700 మీటర్ల హాగరి వంతెనను పరిశీలించారు. దీంతో కర్ణాటక ఇరిగేషన్ ఎస్.ఇ, సంబంధిత అధికారులు యంత్రాంగం ఆందోళన స్థలానికి చేరుకొని మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తో మాట్లాడారు. దీంతో అధికారులపై "కోట్ల"ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లర్లు కూలిపోవడంతో నీటి మళ్ళింపు ద్వారా కర్నూలు జిల్లా వైపు రెండున్నర లక్షల ఎకరాలు, కర్ణాటకలో ఒక లక్ష ఎకరాలు ఆయకట్టు రైతులు తమ పంట పొలాలు ఎండిపోయి ఆత్మహత్యలే శరణ్యంగా దాపురించిందని ఆవేదనవ్యక్తం చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు నవంబర్ 4వ తేదీ లోపు పరిష్కరిస్తామని కోట్లకు తెలపడంతో "కోట్ల" సూచన మేరకు రైతులు శాంతించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ... జిల్లా రైతాంగానికి ఇంత అన్యాయం జరుగుతున్నా... మంత్రులు, ఎమ్మెల్యేలు నిద్రపోతు న్నారని మండిపడ్డారు. కనీసం కర్ణాటక ప్రభుత్వం పై ధ్వజమెత్తే శక్తి వారికి లేకపోవడం విచారకరమన్నారు. ప్రజల బాగోగులు వీరికి పట్టవని దోచుకోవడం, దాచుకోవడం లక్ష్యంగా ఉన్నారని ఆరోపించారు. సహనం కోల్పోతే ఇక రైతులతో కలిసి సమరానికి సిద్ధం గా ఉంటానని కర్ణాటక ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంట మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి సోదరుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస రెడ్డి, ఆదోని నియోజకవర్గ నేతలు మధిర భాస్కర రెడ్డి, కురువ దేవేంద్రప్ప, సోమశేఖర్ రెడ్డి, రామస్వామి ఎమ్మిగనూరు నియోజకవర్గ నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, మల్కాపురం నాగిరెడ్డి, వేముగోడు కృష్ణారెడ్డి, కదిరికోట ఆదెన్న, జి. అల్తాఫ్, మంత్రాలయం నియోజవర్గం నాయకులు ఉరుకుంద సంజీవరెడ్డి, విజయ రామిరెడ్డి, రాఘవరెడ్డి, కోడుమూరు నియోజకవర్గం నేతలు మధుసూదన్ రెడ్డి,సి. బి.లత, కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భాగ్యరత్నమ్మ , ఆలూరు నియోజకవర్గం నేతలు, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# నిత్యం ప్రజల్లోనే ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి...



గడప గడప ద్వారా ప్రజలకు చేరువ అవుతున్న ఎర్రకోట జగనన్న
ప్రజల సమస్యల పరిష్కారం అజెండాగా దృఢ సంకల్పంతో
ముందుకు కదులుతున్న ఎర్రకోట జగనన్న సైన్యం...
సంక్షేమానికి అర్థం చెప్పేలా ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలన మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా తలచిన వైనం
అనతికాలంలోనే 95 శాతం మేర హామీల అమలు
గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం

ఎమ్మిగనూరు పట్టణంలోని 5వ వార్డు ఎల్లమ్మ గుడి నుండి బిప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రజలందరి ప్రభుత్వం మనది - ఎర్రకోట జగనన్న బి బిగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలను కలుసుకుని వారు పొందిన సంక్షేమ పథకాలను తెలియచేస్తూ.. ముందుకు కదులుతున్న ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి గారు...బి మన ప్రియతమ నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు గడపగడపకు వెళ్లి కుటుంబం లో గల ప్రతీ ఒక్క సభ్యులను ఆప్యాయంగా పలకరించి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో మన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు పొందిన ప్రయోజనాన్ని తెలియ చేయడంతో పాటు వారు పొందుతున్న పథకాల వివరాలతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు స్వయానా సంతకం చేసిన కరపత్రాన్ని, ప్రభుత్వం 3ఏళ్ల పాలనా కాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన బుక్ లెట్ ను స్వయానా నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు ఆయన చేతులు మీదుగా వారికి అందచేస్తూ, వారికి అర్హత ఉండి ఇంకేమైనా సంక్షేమ పథకాలు అందటం లేదా అని అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కొరకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ అక్కడికక్కడే సమస్య పరిష్కారమయ్యే దిశగా ఆలోచిస్తూ దిశానిర్దేశాలతో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు...?? ప్రజా ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిని 2024 ఎన్నికల్లో మరోసారి మీరంతా మనస్ఫూర్తిగా దీవించాలని కోరుతూ... కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు...ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ ఆమాన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్. రఘు, వైస్ చైర్మన్ డి. నజీర్ అహ్మద్, కమిషనర్ ఎన్. గంగిరెడ్డి, డిఈఈ మనోహర్ రెడ్డి, టిఎంసి వేంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి యూకె. వీరేంద్ర, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, కౌన్సిలర్లు, ఇన్ ఛార్జ్ లు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని కలిసిన నాగస్వరం నరసింహం

నంద్యాల అక్టోబర్ 27 నంద్యాల అక్టోబర్ 27 సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలలో పని చేస్తున్న పార్ట్ టైం మరియు అవుట్ సోర్స్ క్రింద పనిచేస్తున్న లెక్చలర్లు మరియు టీచర్ లను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్పు చేసి వేతనాలను పెంచాలని వారి యొక్క ఇబ్బందులను స్వయంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

వర్యులు శ్రీ మేరుగ నాగార్జున ని కలిసి వినతి పత్రం సమర్పించి పార్ట్ టైం లెక్చరర్ టీచర్స్ వారు పడుతున్న ఇబ్బందులు సమస్యలపై మంత్రిగారితో చర్చించిన వారికి న్యాయం చేయాలని కోరిన పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నాగ స్వరం నరసింహం

# నకిలీ సీడ్స్ విత్తనాల కంపెనీలకు వత్తాసు పలుకుతున్న వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలి. సిపిఐ

నంద్యాల అక్టోబర్ 27 నంద్యాల జిల్లాలో నకిలీ సీడ్స్ విత్తన కంపెనీ ద్వారా నష్టపోయిన రైతులకు ఎకరాకు లక్ష రూపాయలునష్ట పరిహారం ఇవ్వాలని. నకిలీ సీడ్స్ కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. నకిలీ కంపెనీ విత్తనాలు అరికట్టడంలో విఫలమైన వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలని. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలనకు వచ్చిన శాస్త్రవేత్తలకు. అధికారిని శ్రీమతి సుధారాణి గారికి డిమాండ్ తో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిఎస్.బాబా ఫక్రుద్దీన్ . సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎమ్.రాముడు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు. ఏ సుబ్బరాయుడు. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు జి. సోమన్న . పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో రోజురోజుకు పలు మండలాల్లో నకిలీ సీడ్స్ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్న వ్యవసాయ అధికారులు గానీ రాజకీయ నాయకులు కానీ ఏమాత్రం పట్టించుకోక పోవడం దుర్మార్గమని అన్నారు. నకిలీ విత్తనాల ముఠా నాయకుడు గా ఉన్న నంద్యాల పార్లమెంటు సభ్యుడుపోచా.బ్రహ్మానంద రెడ్డి రైతులకు నకిలీ విత్తనాలతో నష్టపోయిన ఆత్మహత్యలు చేసుకున్న చేసుకుంటామని ప్రభుత్వానికి అధికారులకు బహిరంగంగా తెలియజేస్తున్న న వారిని ఆదుకోవాల్సిన పోయి అధికంగా నష్టపోయిన రైతులను.కవులు రైతులను పలకరించిన పాపాన లేక పోవడం దారుణం అని వ్యవసాయ అధికారులు రైతు లు పండించే పంటలకు భీమా సౌకర్యం కల్పించడం లో వైఫల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పర్యటిస్తున్న శాస్త్రవేత్తలు సక్రమంగా తుది నివేదిక ప్రభుత్వానికి అందజేసి నష్టపోయిన రైతుఎకరానికి లక్ష రూపాయల నష్ట పరిహారం అందజేయాలని. నకిలీసీడ్స్ విత్తనాలకంపెనీలు. కావేరి. సీడ్స్ లోని బిడర్. నాన్ బిటి. అఖిర.వేదా సీడ్స్ ప్రభాస్ సీడ్స్కంపెనీ యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కంపెనీలకు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యం వహించిన వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# బుట్టబొమ్మ దీవాళి మెరుపులు..



దీపావళి పండుగ రోజు ప్రేక్షకులను అలరించేందుకు తారాలంతా కలర్ ఫుల్ గా రెడీ అయ్యారు. సోషల్ మీడియా నిండా స్టార్ భామల క్రేజీ ఫోటోలతో నిండిపోయింది. ఇక వారిలో బుట్ట బొమ్మ పూజా హెగ్డే చాలా స్పెషల్ గా కనిపిస్తుంది.దీపావళి సంబరాల్లో తన క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటుంది పూజా హెగ్దే. ఎప్పుడూ థైస్ షో చేస్తూ ఫ్యాన్స్ గుండెల్లో మోత మోగించే అమ్మడు లేటెస్ట్ ఫోటో షూట్స్ తో మాత్రం ట్రెడిషనల్ వేర్ తో కనిపించింది. పూజా హెగ్దే ఇలా ఫోటో షేర్ చేసిందో లేదో అలా వైరల్ గా రాయి. తన మార్క్ అందాల ప్రదర్శనతో సౌత్ లో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న పూజా హెగ్దే ఇప్పుడు బాలీవుడ్ లో కూడా వరుస ఛాన్సులు అందుకుంటుంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ వెంకటేష్ కలిసి నటిస్తున్న క్రేజీ మల్టీస్టారర్ కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమాలో సల్మాన్ జోడీగా నటిస్తుంది పూజా హెగ్దే.ఆ సినిమాతో బాలీవుడ్ ఆడియన్స్ ని తన మాయలో పడేయాలని ఫిక్స్ అయ్యింది పూజా హెగ్దే. బీస్ట్ ఆచార్య రాధే శ్యాం ముచ్చటగా 3 సినిమాలతో ఫ్లాప్ అందుకున్న పూజా హెగ్దే ఈ3లో స్పెషల్ సాంగ్ లో మెప్పించింది.మహేష్ త్రివిక్రం కాంబోలో వస్తున్న హ్యాట్రిక్ మూవీలో పూజా హెగ్దే హీరోయిన్ గా చేస్తుంది. ఆమెతో కూడా త్రివిక్రంకి ఇది మూడవ సినిమా. దీపావళి సందర్భంగా దీపాల వెలుగులో తన ఫ్యాన్స్ ని అలరించే ఫోటోస్ ని షేర్ చేసిన పూజా హెగ్దేని చూస్తే క్యూట్ నెస్ ఓవర్ లోడెడ్ అనక తప్పదు.ఫోటోలు షేర్ చేయడమే కాదు నువ్వెక్కడ ఉన్నా సరే నిన్ను నువ్వు ఫాలో అవ్వు అంటూ మెసేజ్ కూడా ఇస్తుంది అమ్మడు. ప్రస్తుతం పూజా హెగ్దే దీవాళి ఫోటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. సినిమాలతోనే కాదు ఫోటో షూట్స్ తో కూడా ప్రత్యేక క్రేజ్ తెచ్చుకున్న పూజా హెగ్దే తెలుగు తమిళ హిందీ భాషల్లో తన సినిమాలతో అలరిస్తుంది.

# దీపావళికి విక్రమ్ సినిమా ఫస్ట్ లుక్



చియాన్ విక్రమ్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు. కోలీవుడ్‌కు సమానంగా టాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ ఏడాది 'కోబ్రా'తో మంచి శుభారంభం దక్కపోయినా.. ఇటీవలే విడుదలైన 'పొన్నియన్ సెల్వన్'తో మంచి విజయం సాధించాడు. లేజండరీ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రం సెప్టెంబర్ 30న విడుదలైన భారీ కలెక్షన్‌లతో దూసుకుపోతుంది. ప్రస్తుతం ఈయన పా.రంజిత్ దర్శకత్వంలో 'చియాన్61' చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది ఇదిలా ఉంటే ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్ అవుతుంది.ఈ సినిమాకు సంబంధించిన టైటిల్/ ఫస్ట్‌లుక్ పోస్టర్ దీపావళికి రిలీజ్ కాబోతున్నట్లు తెలుస్తుంది. దీనిపై త్వరలోనే మేకర్స్ నుండి అఫీషియల్ ప్రకటన వచ్చే చాన్స్ ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 19 శతాబ్దంలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో తెరకెక్కతుందట. అంతేకాకుండా ఈ చిత్రాన్ని 3డీలో రూపొందిస్తున్నారట. తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో షూటింగ్ జరిపి, మిగిలిన భాషల్లో ఈ సినిమాను డబ్బింగ్ చేస్తారట. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# రవితేజ ధమాకా టీజర్ విడుదల




మాస్‌కి కేరాఫ్ అయిన రవితేజ సినిమా వస్తోందంటే మాంచి ధమాకాని ఎక్స్‌పెక్ట్ చేస్తారు ప్రేక్షకులు. అందుకేనేమో.. దాన్నే టైటిల్‌గా పెట్టి సినిమా తీస్తున్నాడు నక్కిన త్రినాథరావు. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ధమాకా' మూవీ నుంచి మూడు రోజులు ముందుగానే ప్రేక్షకులకు టీజర్ రూపంలో దీపావళి కానుక అందింది. యాక్షన్, కామెడీ కలగలిసిన ఈ మాస్ క్రాకర్ రవితేజ మార్క్ యాక్షన్‌తో మస్త్ మస్త్‌గా ఉంది. 'నేను నీలో విలన్‌ని చూస్తే.. నువ్వు నాలో ఒక హీరోని చూస్తావ్. కానీ యాక్షన్‌లోకి దిగానంటే నేనో శాడిస్ట్‌ని' అంటూ ఇంగ్లిష్‌లో స్టైలిష్‌గా డైలాగ్ చెప్పిన రవితేజ.. రౌడీల్ని పరిగెత్తించి కొడుతున్నాడు.'నన్ను కొడితే ఎవడొస్తాడో తెలుసా' అని సత్యం రాజేష్ అడిగితే.. 'అంబులెన్స్ వేసుకుని డ్రైవరొస్తాడు' అంటూ ఫన్నీ పంచ్ వేసి నవ్వించాడు. 'అటు నుంచి ఒక బుల్లెట్ వస్తే.. ఇటు నుంచి దీపావళే' అంటూ విలన్‌కి వార్నింగ్ కూడా ఇచ్చాడు. మొత్తంగా టైటిల్‌కి తగ్గట్టే ఈ సినిమా సూపర్బ్‌గా ఎంటర్‌టైన్ చేయనుందనే నమ్మకాన్ని ఈ టీజర్ కలిగించింది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. వివేక్ కూచిభొట్ల కో ప్రొడ్యూస్ చేస్తున్నారు. డిసెంబర్ 23న సినిమాని విడుదల చేయనున్నట్టు కన్‌ఫర్మ్ చేశారు.

# టీ20 వరల్డ్‌కప్‌ల్లో సెంచరీ హీరోలు వీరే.. భారత్ నుంచి ఒకే ఒక్కడు



దేశవాళీ, ఐపీఎల్ తరహా లీగ్‌ల్లో మూడంకెల స్కోర్‌ను చేరుకోవడం సర్వసాధారణమైపోయినప్పటికీ.. అంతర్జాతీయ టీ20ల్లో మాత్రం ఈ మార్కును చేరుకోవడం చాలా అరుదుగా చూశాం.వరల్డ్‌కప్ లాంటి మెగా టోర్నీల్లో అయితే సెంచరీ సాధించిన ఆటగాళ్ల సంఖ్యను వేళ్లపై లెక్క పెట్టవచ్చు. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్ మొదలైన నాటి నుంచి ఇవాల్టి (అక్టోబర్ 27) దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్ మ్యాచ్ వరకు కేవలం 10 శతకాలు మాత్రమే నమోదయ్యాయంటే నమ్మి తీరాల్సిందే.టీ20 వరల్డ్‌కప్-2022లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆటగాడులీ రొస్సోసాధించిన సుడిగాలి శతకం (56 బంతుల్లో 109; 7 ఫోర్లు, 8 సిక్సర్లు) టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో పదవ శతకంగా రికార్డయ్యింది. పొట్టి ప్రపంచకప్ చరిత్రలో విండీస్ విధ్వంసకర ఆటగాడు క్రిస్ గేల్ (117) తొలి శతకాన్ని నమోదు చేశాడు. 2007 ఇనాగురల్ టీ20 వరల్డ్‌కప్‌లో సౌతాఫ్రికాపై గేల్ శతకం బాదాడు. గేల్ తర్వాత పొట్టి ప్రపంచకప్‌లో రెండో శతకాన్ని టీమిండియా ఆటగాడు సురేశ్ రైనా బాదాడు. రైనా 2010 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై 101 పరుగులు సాధించాడు. టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియా తరఫున ఇప్పటివరకు మూడంకెల స్కోర్ సాధించిన ఆటగాడు రైనా ఒక్కడే కావడం విశేషం.వీరి తర్వాత మహేళ జయవర్ధనే (2010లో జింబాబ్వేపై 100), బ్రెండన్ మెక్‌కల్లమ్ (2012లో బంగ్లాదేశ్‌పై 123), అలెక్స్ హేల్స్ (2014లో శ్రీలంకపై 116 నాటౌట్), అహ్మద్ షెహజాద్ (2014లో బంగ్లాదేశ్‌పై 111 నాటౌట్), తమీమ్ ఇక్బాల్ (2016లో ఓమన్‌పై 103 నాటౌట్), క్రిస్ గేల్ (2016లో ఇంగ్లండ్‌పై 100 నాటౌట్), జోస్ బట్లర్ (2021లో శ్రీలంకపై 101 నాటౌట్), తాజాగా రిలి రొస్సో టీ20 ప్రపంచకప్‌ల్లో శతకాలు సాధించారు.

## బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన దక్షిణాఫ్రికా.. అగ్ర స్థానంలోకి ప్రొటీస్

టీ20 ప్రపంచకప్-2022లో దక్షిణాఫ్రికా బోణీ కొట్టింది. సూపర్-12లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 104 పరుగుల తేడాతో విజయభేరి మోగించింది.తొలుత బ్యాటింగ్ చేసిన ప్రొటీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగుల భారీ స్కోర్ సాధించింది.ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్ రిలీ రుసౌ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ బావుమా ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన రోసౌ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో 56 బంతులు ఎదుర్కొన్న అతడు 7 ఫోర్లు, 8 సిక్స్‌ల సాయంతో 109 పరుగులు చేశాడు. అతడితో పాటు ఓపెనర్ డికాక్ 63 పరుగులతో రాణించాడు. బంగ్లా బౌలర్లలో షకీబ్ ఆల్ హసన్ రెండు వికెట్లు పడగొట్టగా, హసన్ మహ్మద్, టాస్కిన్ అహ్మద్ తలా వికెట్ సాధించారు.206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌కు ప్రొటీస్ పేసర్ అన్రిచ్ నోర్జే చుక్కలు చూపించాడు. ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టిన నోర్జే.. బంగ్లాదేశ్ పతనాన్ని శాసిం చాడు. అతడిపాటు స్పిన్నర్ షమ్సి కూడా మూడు వికెట్లు పడగొట్టి బంగ్లాను దెబ్బ తీశాడు. ప్రొటీస్ బౌలర్ల ధాటికి బంగ్లా టైగర్స్ 101 పరుగులకే కుప్పకూలింది .బంగ్లా దేశ్‌పై అద్భుతమైన విజయం సాధిం చిన దక్షిణాఫ్రికా గ్రూప్-2 నుంచి పాయింట్ల పట్టికలో తొలి స్థానానికి చేరుకుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190